క్లుప్తంగా

దర్గాలో ప్రత్యేక ఫాతెహాలు



దర్గాలో ప్రార్థనలు చేస్తున్న భక్తులు

కౌతాళం: మండల కేంద్రమైన కౌతాళంలో మత సామరస్యానికి ప్రతీకగా వెలుగొందుతున్న జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాకు గురువారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ఫాతెహాలు, ప్రార్థనలు జరుపుకున్నారు. దీంతో దర్గా పరిసరా ప్రాంతాలు భక్తులతో సందడిగా మారాయి. తెల్లవారుజామున ఐదు గంటలకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్తీ, పీఠాధిపతి ఖాదర్ బాషా చిష్తీలు స్వామి సమాధికి గంధం పూసి ప్రత్యేక ఫాతేహాలను చేపట్టారు.

16న వాహనాల వేలం

ఆదోని రూరల్: ఆదోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వివిధ నేరాల్లో పట్టుబడిన వాహనాలకు ఈనెల 16వ తేదీన స్టేషన్ ఆవరణలో వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ సైదుల్ తెలిపారు. గురువారం ఆయన స్థానిక కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ వేలంపాటల్లో పాల్గొనే వారు ధరావత్తు రూ.3 వేలు చెల్లించాలన్నారు. ఈనెల 16న ఉదయం 10 గంటలకు వేలం పాట ప్రారంభమవుతుందన్నారు. మరిన్ని వివరాలకు స్థానిక ఎక్సైజ్ కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు.

జీతాల బిల్లులపై నిర్లక్ష్యం తగదు

ఆదోని సెంట్రల్: బదిలీపై అయా పాఠశాలకు వెళ్లిన ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించాల్సిన బిల్లులపై నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ గిల్డ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.చిన్నప్ప, రాష్ట్ర కార్యదర్శి చంద్ర శేఖర్ జిల్లా కార్యదర్శి బసవరాజ్ అన్నారు. ఎస్‌టీఓ కార్యాలయంలో పనిచేస్తున్న సంబంధిత క్లర్క్ బిల్లులు చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నాడని ఎస్‌టీఓ శ్రీనివాసులకు గురువారం విన్నవించారు. దాదాపు మూడు నెలలుగా జీతాలు రాక ఇబ్బందులకు గురవుతున్నామని తెలిపారు. జీతాలు బిల్లులు చేయాలని ఎన్నిసార్లు విన్నవించినా నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన ఎస్‌టీఓ బిల్లులను పరిశీలించి త్వరితగతిన జీతాలు అందేవిధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏపీటీజీ నాయకులు జయరాం పాల్గొన్నారు.

బాధిత గొర్రెల కాపరుల కుటుంబాలను ఆదుకోవాలి

కోసిగి: నంద్యాల జిల్లాకు చెందిన ఇద్దరు గొర్రెల కాపరులు వెంకటేశులు, నరసింహులు లారీ ప్రమాదంలో మృతి చెందారని, వారి కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని ఆంధ్ర ప్రదేశ్ గొర్రెల పెంపకం దారుల సంఘం ఉమ్మడి జిల్లా నాయకులు కురువ రాముడు, నందవరం శ్రీనివాసులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఒక్కొక్కరికి రూ.25లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లించి ఆదుకోవాలన్నారు. రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన గొర్రెలకు ఒక్కొక్కటి రూ.10వేలు చొప్పున నష్టపరిహారం చెల్లించాలని కోరారు.

డ్రైనేజీ పనుల పరిశీలన

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని సోమప్ప సర్కిల్ నుంచి పార్క్‌రోడ్‌కు వెళ్లే ప్రధాన రహదారిలో ఇటీవల కుంగిపోయిన డ్రైనేజీకి చేపట్టిన మరమ్మతు పనులను గురువారం మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి పరిశీలించారు. అదేవిధంగా పార్క్‌రోడ్, కమిటీ రోడ్డు, కర్నూలు బైపాస్ రోడ్డు ప్రాంతాల్లో పారిశుధ్య పనులను పరిశీలించారు.

13న దళిత సమ్మేళన సభ

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవనానికి రూ.2కోట్లు మంజూరు, డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహం ఏర్పాటు చేయాలన్న డిమాండ్లతో ఈనెల 13వ తేదీన పట్టణంలోని కుర్ణికళ్యాణ మండపంలో నిర్వహించనున్న దళిత సమ్మేళన సభను జయప్రదం చేయాలని కేవీపీఎస్ నాయకులు తిమ్మన్న, రాజారమేష్‌లు కోరారు. గురువారం మండలంలోని కలుగొట్ల, నాగలాపురం, పార్లపల్లి గ్రామాల్లో పర్యటించి కరపత్రాలను ఆవిష్కరించారు. నాయకులు రాము, రాముడు, ఈరన్న, రామలింగప్ప, ఏసన్న, రవి తదితరులు పాల్గొన్నారు.

ఉల్లిలో యాజమాన్య పద్ధతులు పాటించాలి



మాట్లాడుతున్న శాస్త్రవేత్త సుజాతమ్మ

గోనెగండ్ల: ఉల్లి సాగుచేసిన రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలని డాట్ సెంటర్ ప్రధాన శాస్త్రవేత్త సుజాతమ్మ సూచించారు. మండలంలోని హెచ్. కైరవాడి గ్రామంలో గురువారం ఉల్లి రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఉల్లి పంట సాగులో రసాయన ఎరువుల వాడకం తగ్గించాలన్నారు. పంటని కోత కోశాక 7 నుంచి 10 రోజులు పొలంలో అరబెట్టుకొని ఆ తర్వాత గ్రేడింగ్ చేసుకోవాలన్నారు. అలాగే ఉద్యానశాఖలో అమలయ్యే పథకాలను వినియోగించుకొని ఖర్చు తగ్గించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉద్యానశాఖ అధికారిణి శ్రీవాణి, రైతు సేవ కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



దరి వాగు ఉధృతిని పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్



పెద్దకొత్తిలి వద్ద వంతెనపై ప్రవహిస్తున్న వరద నీరు





ఇబ్రహీపురం కొట్టాల - నదికైరవాడి మధ్య దరి వాగులో నిలిచిపోయిన బస్సు, కల్లుదేవకుంట బీసీ కాలనీలో వాన నీరు చేరిన దృశ్యం

భారీ వర్షం

- పొంగి పొర్లిన వాగులు, వంకలు
- నీట మునిగిన పంటలు
- వాగులో ఇరుక్కున్న బస్సు



దరి వాగును దాటేందుకు ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు

మంత్రాయలం రూరల్ : మండలంలో బుధవారం సాయంత్రం నుంచి గురువారం ఉదయం వరకు భారీ వర్షం కురిసింది. ఈ వరానికి మండలంలోని వాగులు, వంకలు పొంగి పొర్లాయి. పంటలు నీట మునిగాయి. గ్రామాలు సైతం జలమయమయ్యాయి. మండల పరిధిలోని కల్లుదేవకుంట గ్రామంలో బీసీ కాలనీలో వర్షపు భారీగా చేరాయి. పశువుల మేత నీట మునగడంతో పాడి రైతులు ఇబ్బందులు పడ్డారు. నల్లవాగు సమీపంలో వరి పంట నీట మునిగింది. భారీ వర్షానికి రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

ఉధృతంగా దరి వాగు

మంత్రాలయం గ్రామ సమీపంలోని నదికై రవాడి ప్రధాన రహదారిలోని దరి వాగు పొంగి పొర్లడడంతో విద్యార్థి బస్సు అందులో ఇరుక్కుంది. నీటి ప్రవహం తక్కువగా ఉందని డ్రైవర్ వాగులో వెళ్లడం .. వరద ఉధృతి ఎక్కువగా ఉండడంతో మధ్యలోనే బస్సు నిలిచిపోయింది. బస్సులో ప్రయాణికులు లేకపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు. తర్వాత బస్సును జేసీబీ సహాయంతో బయటకు తీశారు. అనంతరం బస్సును ఆర్టీసీ డిపో మేనేజర్ మద్దిలేటి నాయుడు పరిశీలించారు. విషయం తెలుసుకున్న ఆదోని సబ్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్, తహసీల్దార్ రమాదేవి దరి వాగు, నల్లవాగు ఉధృతిని పరిశీలించారు. అలాగే మంత్రాలయంలోని రాఘవేంద్రపురం, రాఘవేంద్ర స్వామి సర్కిల్‌లో వాన నీరుతో భక్తులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. భారీ వర్షాలు కురుస్తుడడంతో ప్రజలు, ప్రయాణికులు జాగ్రత్తలు పాటించాలని, అధికారులు కూడా అప్రమత్తం చేయాలని సబ్ కలెక్టర్ సూచించారు.

లోతట్టు ప్రాంతాలు జలమయం

నందవరం : భారీ వర్షం రాకతో మండలంలో వాగులు, వంకలు పొంగి పొర్లాయి. లోతట్టు ప్రాంతాలు, పంట పొలాలు వాన నీటితో నిండిపోయాయి. బుధవారం సాయంత్రం నుంచి గురువారం ఉదయం వరకు వర్షం కురిసింది. మండల పరిధిలోని పెద్దకొత్తిలి గ్రామంలోని వంక నిండి వంతెనపై వరద నీరు ఉధృతంగా ప్రవహించడంతో మంత్రాలయం మీదుగా వెళ్లే వాహనాలకు కొద్ది పాటు అంతరాయం ఏర్పడింది. గతంలో కురిసిన వర్షాలకే పత్తి, ఉల్లి పంటలు దెబ్బతిన్నాయి. ఈ వానకు చేతికి వచ్చిన పత్తి రాలిపోతుందని, పంట తడిసి పోయిందని రైతులు ఆందోళన చెందుతున్నారు. నందవరం మండలంలో 27.4 మీ. మీటర్ల వర్షపాతం నమోదయింది.

ప్రజలు అప్రమత్తంగా ఉండండి

భారీ వర్షాల కారణంగా రైతులు, ఆయా గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ శ్రీనివాసులు సూచించారు. గురువారం మండల పరిధిలోని నదికై రవాడి గ్రామ సమీపంలోని వంకలో వరద నీటి ప్రవాహనికి నిలిచిన విద్యార్థి బస్సును తహసీల్దార్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ..తుఫాన్ తాకిడికి భారీ వర్షాలు కురుస్తున్నాయని, నది తీర ప్రాంతా ప్రజలు, ప్రయాణికులు, రైతులు జాగ్రత్తగా ఉండాలన్నారు. మెరుపులు, ఉరుములతో కూడిన వర్షాలు కురవడంతో అప్రమత్తత అవసరమన్నారు.



నల్లవాగు సమీపంలో నీట మునిగిన వరి పొలాలు

ఆదోని డివిజన్‌లో వర్షపాతం ఇలా..

ఆదోని సెంట్రల్: ఆదోని డివిజన్ పరిధిలో బుధవారం అర్ధరాత్రి నుంచి గురువారం ఉదయం 10 గంటల వరకు వర్షం కురిసింది. వర్షం కురవడంతో అయా మండలాల్లో వాగులు వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. అయా మండలాల్లో కురిసిన వర్షపాతం వివరాలను అధికారులు వెల్లడించారు. అత్యధికంగా మంత్రాలయం మండలంలో 51.6 మిల్లీ మీటర్లు వర్షం కురువగా అత్యల్పంగా గొనెగొండ్ల మండలంలో 2.6 మిల్లీ మీటర్లు వర్షం కురిసింది. ఆదోని మండలంలో 28.2 మిల్లీ మీటర్లు, నందవరం మండలంలో 27.4 మిల్లీ మీటర్లు, హోళగుంద మండలంలో 16.4 మిల్లీ మీటర్లు, కౌతాళం మండలంలో 8.6 మిల్లీ మీటర్లు ఎమ్మిగనూరు మండలంలో 5.8 మిల్లీ మీటర్లు వర్షం కురిసింది.

పంట కాలం పూర్తయ్యాకే ఉల్లి కోతలు చేపట్టాలి



వేముగోడులో ఉల్లి ఉత్పత్తులను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

గోనెగండ్ల : పంట కాలం పూర్తయిన తరువాతనే ఉల్లి కోత కోయాలని, పరిణితి చెందని గడ్డలు కోత కోయడం ద్వారా నష్టం వాటిల్లుతుందని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ తెలిపారు. మండలంలోని వేముగోడు గ్రామంలో గురువారం సాయంత్రం ఉల్లి పంట ఉత్పత్తులను అధికారులతో కలిసి పరిశీలించి పంట సాగు, ఉత్పత్తి, అమ్మకాలపై రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ మాట్లాడుతూ ఉల్లికి ప్రభుత్వం మద్దతు ధర కేజీకి రూ.12 రూపాయాలు అందిస్తుందన్నారు. నాణ్యమైన ఉల్లికి ప్రభుత్వం కేజీకు రూ.12 కంటే ఎక్కువ ధర లభించే అవకాశం ఉందని తెలిపారు. పచ్చిగా ఉన్న, గ్రేడింగ్ చేయని ఉల్లి దూరప్రాంతాలకు రవాణా చేసే లోపు చెడిపోతుందన్నారు. శని, ఆదివారాలు కర్నూలు మార్కెట్ సెలవు ఉంటున్నందున ప్రత్యామ్నాయంగా తాడేపల్లిగూడెంలో కూడా ప్రభుత్వ మద్దతు ధర లభిస్తుందని సూచించారు. రైతులు తప్పనిసరిగా ఉల్లిని ఆరబెట్టి, గ్రేడింగ్ చేసి మార్కెట్ యార్డుకు తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజేశ్వరి, ఏఓ హేమలత, ఉద్యానశాఖ అధికారిణి శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.

అండర్ 19 ఫుట్‌బాల్ ఉమ్మడి జిల్లా జట్ల ఎంపిక





ఎంపికైన బాలుర జట్టుతో వ్యాయామ ఉపాధ్యాయులు, బాలికల జట్టు

ఎమ్మిగనూరుటౌన్: క్రీడల్లో రాణిస్తే విద్యార్థులకు మంచి భవిష్యత్ వుంటుందని ఉమ్మడి కర్నూలు జిల్లా అండర్ 19 ఎస్‌జీఎఫ్, స్కూల్ గేమ్స్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కె.రాఘవేంద్ర, స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వరప్రసాద్ అన్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లా అండర్ 19 ఎస్‌జీఎఫ్, స్కూల్ గేమ్స్ క్రీడాకారుల ఎంపిక గురువారం పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించారు. మొత్తం 160 మంది బాలబాలికలు పాల్గొన్నారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు నర్సప్ప, చిట్టిప్రసాద్, నాగేషు, మురళి, హనీఫ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఐక్యతతోనే కార్మిక హక్కుల సాధన

పెద్దకడబూరు : కార్మికుల ఐక్యతతోనే హక్కులు సాధించవచ్చని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎండీ అంజిబాబు అన్నారు. మండల కేంద్రంలోని చౌడేశ్వరిదేవి ఆలయంలో గురువారం సీఐటీయూ మండల మహాసభలను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాల వలన కార్మికుల జీవితాలు రోజురోజుకు దినదిన గండంగా మారుతున్నాయన్నారు. స్కీం వర్కర్లకు ఉద్యోగ భద్రత లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. సీఐటీయూ మండల కార్యదర్శిగా ఈరన్న, అధ్యక్షుడు తలారి భీమన్న, ఉపాధ్యక్షులు జయమ్మ, ఇందిర, సహాయ కార్యదర్శిలు తలారి నాగరాజు, తలారి ఉసేని, తలారి నరసింహులతో పాటు మరో 8 మంది కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల గౌరవ అధ్యక్షుడు తిక్కన్న, కేవీపీఎస్ మండల కార్యదర్శి దేవదాసు, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు జయమ్మ, రైతు సంఘం జిల్లా కార్యవర్గ సభ్యుడు పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతకు సన్మానం



మారుతీమోహన్ దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

కౌతాళం: నాటక రంగంలో విశేష సేవలు అందించి అవార్డు పొందిన కౌతాళం సహకార పరపతి సంఘం రిటైర్డ్ సీఈఓ మారుతీమోహన్‌ను వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, మాజీ జెడ్పీటీసీ దాట్ల కృష్ణంరాజు ఆధ్వర్యంలో గురువారం దాట్ల యూత్ వారు శాలువా పూలమాలతో ఘనంగా సన్మానించారు. ధర్మవరం రామకృష్ణ ఆచార్య జాతీయ అవార్డును ఇటీవల మారుతీమోహన్‌కు బళ్లారిలో జరిగిన సమావేశంలో ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నాయకుడు దాట్ల సుబ్బారాజు మాట్లాడుతూ కౌతాళానికి చెందిన మారుతీమోహన్ జాతీయ అవార్డును పొందడం గర్వకారణం అన్నారు. కార్యక్రమంలో హమ్మద్, రాము, సత్యగౌడ్, డ్రైవర్‌లింగ, డాక్టర్ అప్పులు, ఉపేంద్రగౌడ్, మోదీన్ తదితరులు పాల్గొన్నారు.

క్షయవ్యాధి రహిత సమాజాన్ని నిర్మిద్దాం



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ షేకున్‌బాను

ఆదోని టౌన్: క్షయవ్యాధి రహిత సమాజాన్ని నిర్మిద్దామని, క్షయవ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ షేకున్‌బాను అన్నారు. గురువారం ఆదోని పట్టణంలోని అరుణ్ జ్యోతినగర్ హెల్త్ సెంటర్‌లోని రాంజల రోడ్డు ప్రాంతంలో టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ మాట్లాడుతూ రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం ఉన్న వారు, గళ్లలో తెమడ మరియు రక్తం పడడం, ఛాతిలో నొప్పి, ఆయాసం తదితర లక్షణాల్లో ఏ ఒక్కటి ఉన్నా ప్రభుత్వ ఆసుపత్రిలో గళ్ల పరీక్ష చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్‌లు బాబురాజు, సుబ్బమ్మబాయి, ఏఎన్‌ఎంలు సుజాత, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

క్షయ బాధితులకు పోషకాహార కిట్ల పంపిణీ

పెద్దకడబూరు : క్షయ వ్యాధి బాధితులు కచ్చితంగా 6 నెలల పాటు మందులు వాడాలని ఎంటీసీ డాక్టర్ షేకున్‌బాను, మెడికల్ ఆఫీసర్ కేజియా సూచించారు. హెల్త్ స్టాఫ్ సహకారంతో టీబీ రోగులకు గురువారం పోషకాహార కిట్లును పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ ఆదినారాయణ, సూపర్‌వైజర్లు లక్ష్మినరసమ్మ, బాబురాజు, ఫ్లోరెన్స్ నైటింగేల్, భాస్కర్, ఖదీర్‌భాష, ఫార్మసిస్ట్, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

విగ్రహం ధ్వంసం చేసిన దుండగులను శిక్షించాలి

కోసిగి : ఆలూరు నియోజకవర్గంలోని మణెకుర్తి గ్రామంలో బుధవారం రాత్రి భక్తకనకదాసు విగ్రహం ధ్వంసం చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని కురువ సంఘం జిల్లా అధ్యక్షుడు భానుప్రకాష్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ విగ్రహాలపై దాడులు చేసి కులాల మధ్య చిచ్చుపెట్టే వారిని ఉపేక్షించకుండా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా జీవో తీసుకొని వచ్చి విగ్రహాలపై దాడులకు పాల్పడితే కఠినంగా శిక్షించి తగిన గుణపాఠం చెప్పాల్నారు.

బైపాస్ రోడ్డుకు స్థల పరిశీలన

మంత్రాలయం రూరల్ : మండల పరిధిలోని కల్లుదేవకుంట గ్రామంలోని 167వ జాతీయ రహదారిపై బైపాస్ రోడ్డు నిర్మించేందుకు ప్రభుత్వం ప్రతిపాదనలు సిద్ధం చేసింది. అందులో భాగంగా గురువారం కల్లుదేవకుంట నుంచి మంత్రాలయం, చెట్నహళ్లి గ్రామాలకు చెందిన రైతుల పొలాలను ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ..బైపాస్ నిర్మించేందుకు రైతుల పొలాలను పరిశీలించినట్లు వివరించారు. అలాగే మంత్రాలయంలోని స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఉల్లి రైతులతో మాట్లాడి సమస్యలు, గిట్టుబాటు ధరలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమాదేవి, మండల సర్వేయర్ అశోక్, ఆర్ఐ జనార్దన్‌రావు, వీఆర్వో భీమన్నగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గొర్రెలపై దూసుకెళ్లిన బొలెరో

– 8 గొర్రెలు మృతి

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని బోడబండ గ్రామం సమీపంలో గురువారం రోడ్డు దాటుతున్న గొర్రెల మందపైకి పత్తి లోడ్‌తో వెళ్తున్న బొలెరో దూసుకెళ్లడంతో 8 గొర్రెలు మృతి చెందాయి. వెంటనే గ్రామస్తులు బొలెరో వాహనాన్ని పట్టుకున్నారు. గొర్రెలు రోడ్డు దాటుతున్నాయి.. నిదానంగా రావాలనే ఆలోచన లేకుండా వేగంగా వాహన నడపడంతో ఈ ప్రమాదం జరిగినట్లు గొర్రెల యజమాని వెంకటరాముడు తెలిపారు. మృతి చెందిన గొర్రెల విలువ రూ. లక్ష వరకు ఉంటుందని, తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

సచివాలయ ఉద్యోగులకు పని భారం తగ్గించాలి

ఎమ్మిగనూరుటౌన్: వార్డు సచివాలయ ఉద్యోగులకు పని భారం తగ్గించాలని ఇందులో భాగంగా డోర్ టు డోర్ వలంటీర్ల విధుల నుంచి తప్పించాలని వార్డు సచివాలయ ఉద్యోగులు డిమాండ్ చేశారు. రాష్ట్ర గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల జేఏసీ పిలుపు మేరకు గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ గంగిరెడ్డికి, రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ శేషఫణికి వినతి పత్రాలను ఇచ్చారు. వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘ నాయకులు హంపిరెడ్డి, రవి కిరణ్ , అకిఫ్ ఖురేషి, తిలక్‌కుమార్, మల్లికార్జున, లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

గాజులదిన్నె ప్రాజెక్టు సందర్శన



జీడీపీ అధికారులతో మాట్లాడుతున్న డీఎస్పీ భార్గవి

గోనెగండ్ల : మండలంలోని గాజులదిన్నె ప్రాజెక్టును గురువారం సాయంత్రం ఎమ్మిగనూరు డీఎస్పీ భార్గవి సందర్శించారు. జీడీపీ నీటి సామర్థ్యం, ప్రస్తుతం జీడీపీలో నీటి నిల్వ గూరించి జీడీపీ అధికారులను అడిగి తెలుసుకున్నారు. డీఎస్పీ మాట్లాడుతూ అల్పపీడన ప్రభావంతో ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నాయని, హంద్రీనది పరివాహక ప్రాంత ప్రజలను అప్రమత్తం చేయాలని అధికారులకు ఆదేశించారు. జీడీపీ ఎగువ ప్రాంతంలో వర్షాలు కురిసి వరద నీరు జీడీపీలోకి వచ్చి చేరితే గెట్లు ఎత్తే అవకాశం ఉంది కాబట్టి ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. హంద్రీనది సమీపంలోని రైతులు పంట పొలాల దగ్గర ఉండకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఈ సుబ్బరాయుడు, సీఐ విజయభాస్కర్, ఎస్ఐ అనిల్, సిబ్బంది పాల్గొన్నారు.

గాజులదిన్నెకు లస్కర్లే దిక్కు



ప్రాజెక్ట్‌లో గురువారం సాయంత్రానికి 376.40మీటర్లకు చేరిన నీటి మట్ట



గాజులదిన్నె ప్రాజెక్ట్

- పూర్తిస్థాయికి చేరుకుంటున్న జీడీపీ నీటి మట్టం
- క్రస్ట్‌గేట్ల నిర్వహణకు కరువైన టెక్నికల్ సిబ్బంది
- లస్కర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లతో నిర్వహణ
- సిబ్బందిని నియమించడంలో విఫలమవుతున్న ప్రభుత్వం

ఎమ్మిగనూరుటౌన్: గాజులదిన్నె ప్రాజెక్ట్ క్యాచ్‌మెంట్ ఏరియాల్లో బుధవారం రాత్రి నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు వరద నీటితో ప్రాజెక్ట్‌లో నీటి మట్టం క్రమేపి పెరుగుతోంది. ప్రాజెక్ట్‌లో 377 మీటర్ల మేర నీటిని నిల్వచేసే సామర్థ్యం ఉండగా గురువారం సాయంత్రానికి 376.40మీటర్లకు చేరుకుంది. పత్తికొండ నియోజకవర్గంలోని పలు మండలాల్లో ఓ మోస్తరు వర్షాలు కురవడంతో అలారుదిన్నెబ్రిడ్జి వద్ద నుంచి వరద నీటి ఇన్‌ఫ్లో పెరుగుతుండటంతో గురువారం రాత్రికి నీటి మట్టం గరిష్టస్థాయికి చేరుకోవచ్చని జీడీపీ అధికారులు తెలిపారు. మరో 20సెంటీమీటర్ల మేర వరద నీరు వచ్చి చేరితే ప్రాజెక్ట్‌లో నీటి మట్టం 376.60మీటర్లకు చేరుకుంటుందని అప్పుడు జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రాజెక్ట్ క్రస్ట్‌గేట్లు ఎత్తి నీటిని హంద్రీనదిలో వదిలే అవకాశం వుందని జీడీపీ డీఈ సుబ్బరాయుడు తెలిపారు. అందువలన ప్రాజెక్ట్ కింది పరివాహక ప్రాంత వాసులు, రైతులు హంద్రీ నది వైపు వెళ్ల వద్దని హెచ్చరించారు.

లస్కర్లతోనే క్రస్ట్‌గేట్ల నిర్వహణ

జిల్లాలో ఏకైక మధ్యతరహా నీటిపారుదల ప్రాజెక్ట్ అయిన గాజులదిన్నె ప్రాజెక్ట్ క్రస్ట్ గేట్ల నిర్వహణకు గాను రిగ్గర్, మెకానిక్, ఎలక్ట్రీషియన్ పోస్టులు ఖాళీగా వుండటంతో అక్కడ పనిచేసే లస్కర్లు, వర్క్‌ఇన్ స్పెక్టర్లే దిక్కయ్యారు. గతంలో ప్రాజెక్ట్ క్రస్ట్ గేట్ల నిర్వహణకు ఒకే ఒక్కడుగా వున్న రిగ్గర్ లక్ష్మణ్ పదవీ విరమణ పొందడంతో ఆయన స్థానం భర్తీ కాలేదు. అదేవిధంగా ఎలక్ట్రీషియన్, మెకానిక్ పోస్టులు కూడా ఖాళీగానే వుండటం, రెగ్యులర్ టెక్నికల్ ఉద్యోగులను నియమించకపోవడంతో క్రస్ట్‌గేట్ల నిర్వహణలో ఏదైనా టెక్నికల్ సమస్యలు ఉత్పన్నమైతే చేతులెత్తేయాల్సిన దుస్థితి. నీటి సామర్థ్యం పెరిగి రాత్రి వేళల్లో అకస్మాత్తుగా క్రస్ట్‌గేట్లను ఎత్తే పరిస్థితి వచ్చినప్పుడు సరైన టెక్నికల్ సిబ్బంది లేక ఇబ్బంది పడే పరిస్థితి దాపురించనుంది. గతంలో క్రస్ట్‌గేట్ లేపడంలో ఇబ్బంది తలెత్తి ప్రాజెక్ట్ ఆనకట్ట ఎడమ భాగంలో నుంచి నీరు పారి సిబ్బంది గృహాలతో పాటు గోనెగండ్ల మండలంలోని పలు గ్రామాలు, కర్నూలు నగరంలోని పలు ప్రాంతాలు వరదనీటి ముంపునకు గురైన సందర్భాలున్నాయి. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని ప్రాజెక్ట్ క్రస్ట్ గేట్ల నిర్వహణకు రెగ్యులర్ ప్రాతిపాదికన టెక్నికల్ ఉద్యోగులను నియమించాల్సిన అవసరం వుందని పరివాహక గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

బైక్-కారు ఢీ.. ఇద్దరికి గాయాలు



ప్రమాదంలో గాయపడ్డ లేపాక్షి

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని కోటేకల్ గ్రామ మలుపు వద్ద కారు – మోటార్ బైక్ ఢీ కొనడంతో ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలు అయ్యాయి. ఆదోని వైపు నుంచి కోటేకల్ గ్రామానికి అశోక్, లేపాక్షిలు మోటార్ బైక్‌పై వస్తుండగా.. ఎమ్మిగనూరు నుంచి ఆదోని వైపు వెళ్తున్న కారు కోటేకల మలుపు వద్ద ఎదురెదురుగా ఢీ కొన్నాయి. దీంతో బైక్‌పై ఉన్న లేపాక్షి, అశోక్‌లకు తీవ్ర గాయాలు అయ్యాయి. గాయపడ్డ ఇద్దరు యువకులను పోలీస్‌రోడ్ సేఫ్టీ వాహనంలో ప్రభుత్వాసుపత్రికి చికిత్స కోసం తరలించారు. కేసు నమోదు చేసుకున్నట్లు రూరల్ పోలీసులు తెలిపారు.

పేరు మార్పు

నేను గద్దం రాజేశ్వరి భర్త రాఘవేంద్ర భారతదేశంలోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కర్నూలు జిల్లా కోసిగి మండలం, కోసిగి గ్రామం 6-240-2 వద్ద నివసిస్తున్నాను. నా ఆధార్‌కార్డులో, నా పేరు గద్దం రాజేశ్వరి అని నమోదు చేయబడింది మరియు నా RPLI పాలసీలో, నా పేరు D.SHARADAMMA అని తప్పుగా నమోదు చేయబడింది. పాలసీ నంబర్ R-AP-KR-EA285566 మరియు నా 10వ తరగతి మార్కుల మెమో, నా పేరు DEVAREDDY SHARADAMMA అని నమోదు చేయబడింది. రిజిస్ట్రేషన్ నంబర్:221308 ప్రకారం పైన పేర్కొన్న అన్ని పేర్లు గద్దం రాజేశ్వరి D SHARADAMMA మరియు DEVAREDDY SHARADAMMA ఒకే వ్యక్తిని సూచిస్తాయి. అనగా నా సరైన మరియు అసలు పేరు గద్దం రాజేశ్వరి అని ప్రకటిస్తున్నాను మరియు నా అన్ని రికార్డులలో, ముఖ్యంగా నా గ్రామీణ పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ పాలసీలో ఇదే చివరి పేరుగా తీసుకొని సరిచేయమని అభ్యర్థిస్తున్నాను. ఇది సంబంధిత వారందరికి దయగల సమాచారం కోసం.